కేకేఆర్ X ఎస్ఆర్‌హెచ్

నేడే ఐపీఎల్ ఫైనల్ ఫైట్

ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపీఎల్)లో ఆఖరి అంకానికి రంగం సిద్ధమైంది. రెండు నెలలుగా మండు వేసవిలో అభిమానులను అద్భుత ఆటతీరుతో అలరించిన లీగ్‌లో ఆఖరి ఆటకు వేళ యైంది. లీగ్ దశలో టేబుల్ టాపర్లుగా నిలిచిన సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్), కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్) టైటిల్ పోరులో కదం తొక్కనున్నాయి. ఆదివారం చెపాక్ స్టేడియం వేదికగా కప్ కోసం ఢీ అంటే ఢీ అన్నట్లు పోరాడనున్నాయి. ముఖాముఖి పోరులో హైదరాబాద్‌పై కోల్‌కతాదే పైచేయిగా కనిపిస్తున్నా..ఆఖరి ఆటలో అదృష్టం ఎవరిని వరిస్తుందనేది ఆసక్తికరంగా మారింది. రెండు మ్యాచ్‌ల్లో ఓటమికి కోల్‌కతాపై హైదరాబాద్ ప్రతీకారం తీర్చుకుంటుందా లేక..అదే ఆధిపత్యం ప్రదర్శిస్తూ కేకేఆర్ మూడోసారి విజయం సాధిస్తుందా అన్నది చూడాలి. గంభీర్ మెంటార్‌గా కేకేఆర్ తీన్మార్ దరువేస్తుందా లేక మరోమారు ఆసీస్ ప్లేయర్ సారథ్యంలో హైదరాబాద్ ఐపీఎల్ చాంపియన్‌గా నిలుస్తుందా అన్నది మరికొన్ని గంటల్లో తేలనుంది.

చెన్నై: ఐపీఎల్ ఫైనల్ ఫైట్ అన్ని హంగులతో మన ముందుకు రాబోతున్నది. రెండు నెలల ఈ సుదీర్ఘ ప్రయాణంలో అత్యుత్తమం అన్నదగ్గ రెండు జట్లు సన్‌రైజర్స్ హైదరాబాద్, కోల్‌కతా నైట్‌రైడర్స్ కప్ వేటలో తలపడబోతున్నాయి. ఆదివారం చెపాక్ స్టేడియం వేదికగా ఐపీఎల్ ట్రోఫీని ముద్దాడేందుకు సర్వశక్తులతో కదనరంగంలోకి దూకనున్నాయి. లీగ్ ఇరు జట్లు ముఖాముఖి పోరుతో మొదలుపెట్టగా, చివరగా అవే జట్లు ఇప్పుడు తుది పోరులో సత్తాచాటేందుకు సై అంటు న్నాయి. లీగ్‌లో రెండు సార్లు కోల్‌కతా చేతిలో ఎదురైన ఓటములకు ఫైనల్లో ప్రతీకారం తీర్చుకునేందుకు ఎస్ఆర్‌హెచ్ కదన కుతూహలంతో ఉంటే..కోల్‌కతా తీన్మార్ మోగించేందుకు తహతహలాడుతున్నది. 17 ఏండ్ల సుదీర్ఘ ఐపీఎల్ చరిత్రలో హైదరాబాద్, కోల్‌కతా ఫైనల్లో తలపడటం ఇదే తొలిసారి కావడం విశేషం. ఇదిలా ఉంటే గౌతం గంభీర్ కెప్టెన్సీలో 2012, 14లో ఐపీఎల్ గెలిచిన కేకేఆర్ మరోమారు మెంటార్‌గా ట్రోఫీ అందించాలని చూస్తున్నాడు. మరోవైపు ఎనిమిదేండ్ల క్రితం ఆర్‌సీబీని మట్టికరిపించి తొలిసారి ట్రోఫీని ముద్దాడిన ఎస్ఆర్‌హెచ్ మరోమారు అదే ప్రదర్శన పునరావృతం చేయాలని చూస్తున్నది.దీనికి తోడు గతానికి భిన్నంగా ఈసారి హైదరాబాద్, కోల్‌కతా ఐపీఎల్ రూపురేఖలను మార్చేశాయి.

రయ్ రయ్ రైజర్స్:

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఈ సీజన్‌లో ఆకాశమే హద్దుగా చెలరేగుతున్నది. అసలు ఏమాత్రం అంచనాలు లేకుండా బరిలోకి దిగి ప్రత్యర్థులకు దడ పుట్టించింది. ఇన్నాళ్లు తమ పదునైన బౌలింగ్‌తో స్వల్ప లక్ష్యాలను కాపాడుకున్న ఎస్ఆర్‌హెచ్..ఈ సీజన్‌లో బ్యాటింగ్‌లో దుమ్మురేపింది. డాషింగ్ ద్వయం అభిషేక్‌శర్మ, ట్రావిస్ హెడ్..ప్రత్యర్థి బౌలర్లను చీల్చిచెండాడుతూ ఐపీఎల్‌లో రికార్డులు కొల్లగొట్టారు. ప్రత్యర్థి ఎవరన్నది లెక్కచేయని నైజంతో ఎదుర్కొన్న తొలి బంతి నుంచే బడితే పూజ చేస్తూ భారీ స్కోర్లకు బాటలు వేశారు. కోల్‌కతాతో ఫైనల్లోనూ ఈ ఇద్దరు క్రీజులో కుదురుకుంటే చెపాక్‌లో పరుగుల పండుగే. వీరికి తోడు రాహుల్ త్రిపాఠి, క్లాసెన్, నితీశ్‌కుమార్‌రెడ్డి, మార్క్‌రమ్ జతకలిస్తే సునామీ ముంచెత్తినట్లే. బౌలింగ్‌లో కెప్టెన్ కమిన్స్ మంచి ఫామ్‌లో ఉండగా, భువనేశ్వర్, నటరాజన్ సూపర్ స్పెల్స్‌తో కట్టడి చేస్తున్నారు. మొత్తంగా మరోమారు సమిష్టి ప్రదర్శన కనబరిస్తే..హైదరాబాద్‌లో ఖాతాలో రెండో టైటిల్ చేరినట్లే

కోల్‌కతా తీన్మార్:

లీగ్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్ అంచనాలకు భిన్నంగా రాణిస్తున్నది. గత సీజన్లతో పోలిస్తే..అటు బ్యాటింగ్‌కు తోడు బౌలింగ్‌లో అదరగొడుతూ వరుస విజయాలతో టాప్‌లో నిలిచింది. గౌతం గంభీర్ మెంటార్‌షిప్‌కు తోడు శ్రేయాస్ అయ్యర్ కెప్టెన్సీకి ఈ సీజన్‌లో అదనపు బలంగా మారింది. టాపార్డర్‌లో సునీల్ నరైన్ మరోమారు బ్యాటు ఝుళిపిస్తే కేకేఆర్‌కు తిరుగుండకపోవచ్చు. అయ్యర్ ద్వయం మంచి ఫామ్ మీద ఉన్నారు. వీరికి తోడు రస్సెల్, రింకూసింగ్ జత కలిస్తే ఎంతటి లక్ష్యమైనా ఊదిపడేస్తారు. బౌలింగ్‌లో స్టార్క్ ప్రకంపనలు సృష్టిస్తుంటే వైభవ్ అరోరా, హర్షిత్ రానా పరిస్థితులకు అనుగుణంగా రాణిస్తున్నారు.

జట్ల అంచనా

హైదరాబాద్: హెడ్, అభిషేక్, రాహుల్ త్రిపాఠి, మార్క్‌రమ్, క్లాసెన్, నితీశ్‌కుమార్, సమద్, షాబాజ్/మయాంక్, కమిన్స్(కెప్టెన్), ఉనద్కట్, భువనేశ్వర్, నటరాజన్.

కోల్‌కతా: నరైన్, గుర్బాజ్, అయ్యర్, వెంకటేశ్, శ్రేయాస్(కెప్టెన్), నితీశ్‌రానా, రింకూసింగ్, రస్సెల్, రమన్‌దీప్, స్టార్క్, హర్షిత్, వరుణ్, వైభవ్ అరోరా

పిచ్, వాతావరణం: హైదరాబాద్, కోల్‌కతా ఫైనల్ మ్యాచ్ ఎర్ర మట్టితో పిచ్ సిద్ధం చేశారు. ఇది బ్యాటింగ్‌కు అనుకూలించే అవకాశముంది. ఆదివారం చెన్నైలో వర్షం కురిసే అవకాశం చాలా తక్కువ(5శాతం) కనిపిస్తున్నాయి.

6 గత ఆరు ఐపీఎల్ సీజన్లలో క్వాలిఫయర్-1లో గెలిచిన జట్టు టైటిల్ విజేతగా నిలిచింది.

ఐపీఎల్ టైటిల్ ప్రదర్శన

కోల్‌కతా: 2012, 2014

హైదరాబాద్: 2016

టీ20 ప్రపంచకప్ కోసం శనివారం న్యూయార్క్‌కు బయల్దేరి వెళ్లిన టీమ్‌ఇండియా క్రికెటర్ల బృందం.

పైనల్లో సింధు

మలేషియా మాస్టర్స్ టోర్నీ

కౌలాలంపూర్: భారత స్టార్ షట్లర్ పీవీ సింధు టైటిల్ వేటలో దూసుకెళుతున్నది. గత కొంత కాలంగా ఫామ్‌లేమికి తోడు ఫిట్‌నెస్‌తో సతమతమవుతున్న సింధు మలేషియా మాస్టర్స్ టోర్నీలో ఫైనల్లోకి దూసుకెళ్లింది. ఈ ఏడాది తుదిపోరులో నిలిచిన తొలి టోర్నీ ఇదే కావడం విశేషం. శనివారం జరిగిన మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో ఐదో సీడ్ సింధు 13-21, 21-16, 21-12తో ప్రపంచ 20వ ర్యాంకర్ బుసానన్ ఒన్‌ముగ్రున్‌ఫెన్(థాయ్‌లాండ్)పై అద్భుత విజయం సాధించింది. 88 నిమిషాల పాటు సాగిన పోరులో తొలి గేమ్ కోల్పోయిన ఈ తెలుగు షట్లర్ పుంజుకుని పోటీలోకి వచ్చింది. ప్రత్యర్థికి ఎక్కడా అవకాశమివ్వకుండా ఓవైపు కండ్లు చెదిరే స్మాష్‌లకు తోడు నెట్‌గేమ్‌తో సింధు కీలక పాయింట్లు ఖాతాలో వేసుకుంది. ఈ క్రమంలో రెండో గేమ్‌ను దక్కించుకున్న సింధు కీలకమైన మూడో గేమ్‌లోనూ అదే దూకుడు కొనసాగించి మ్యాచ్‌ను కైవసం చేసుకుంది. చివరిసారి 2022లో సింగపూర్ ఓపెన్ గెలిచిన ఈ యువ షట్లర్ 2023లో మాడ్రిడ్ ఓపెన్‌లో రన్నరప్‌గా నిలిచింది. ఆదివారం జరిగే ఫైనల్లో వాంగ్ జి(చైనా)తో తలపడుతుంది. మ్యాచ్ ముగిసిన తర్వాత సింధు మాట్లాడుతూ 'టోర్నీలో మరో మ్యాచ్ గెలిస్తే నేను ఇంకా సంతోషంగా ఉంటాను. ఈ రోజు జరిగిన పోరులో గెలువడం కూడా ఆనందంగా ఉంది. ఇలాంటి విజయాలు మరింత ఆత్మవిశ్వాసాన్ని ఇస్తాయి. తొలి గేమ్ కోల్పోయినా.. రెండో గేమ్‌లో ఆధిక్యంలోకి వచ్చాను.

సురేఖ పతక ధమాకా

యెచియోన్(దక్షిణకొరియా): ప్రతిష్ఠాత్మక ఆర్చరీ వరల్డ్‌కప్ టోర్నీలో భారత స్టార్ ఆర్చర్ వెన్నెం జ్యోతి సురేఖ రెండు పతకాలతో అదరగొట్టింది. శనివారం జరిగిన మహిళల కాంపౌండ్ టీమ్ ఈవెంట్ ఫైనల్లో జ్యోతిసురేఖ, పర్నీత్‌కౌర్, అదితి స్వామితో కూడిన భారత త్రయం 232-226తో హజల్ బురున్, బెరా సుజుర్, యువ బేగం(టర్కీ)పై అద్భుత విజయం సాధించింది. వరుసగా మూడు ప్రపంచకప్ టోర్నీలో భారత ఆర్చర్లు పసిడి పతకాలు కొల్లగొట్టారు. అదే జోరు కనబరుస్తూ కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ ఫైనల్లో జ్యోతి సురేఖ, ప్రియాంశ్ ద్వయం 153-155తో ఒలివియా డీన్, స్వావెర్ సులివాన్(అమెరికా) జోడీ చేతిలో ఓడి రజత పతకంతో సరిపెట్టుకున్నారు. పురుషుల కాంపౌండ్ టీమ్ కాంస్య పోరులో ప్రియాంశ్, పార్థమేశ్, అభిషేక్ త్రయం ఆస్ట్రేలియా చేతిలో ఓటమిపాలైంది. మహిళల రికర్వ్ విభాగంలో దీపికా కుమారి సెమీస్‌లోకి దూసుకెళ్లింది. వ్యక్తిగత కాంపౌండ్ కాంస్య పోరులో పార్థమేశ్ ఓటమిపాలయ్యాడు.

సిమ్రాన్‌కు స్వర్ణం

పారా అథ్లెటిక్స్ ప్రపంచ చాంపియన్‌షిప్

కోబ్(జపాన్): ప్రతిష్ఠాత్మక పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో భారత పతక జోరు ఆఖరి వరకు దిగ్విజయంగా కొనసాగింది. పోటీలకు ఆఖరి రోజైన శనివారం సిమ్రాన్‌శర్మ స్వర్ణ పతకంతో మెరిసింది. మహిళల 200మీటర్ల టీ12 రేసును సిమ్రాన్ 24.95సెకన్లలో ముగించి పసిడి పతకాన్ని ముద్దాడింది. తన వ్యక్తిగత ప్రదర్శన(25.16సె)ను మరింత మెరుగుపర్చుకుంటూ అగ్రస్థానంలో నిలిచింది. మరోవైపు మహిళల 100మీటర్ల టీ35 విభాగంలో ప్రీతిపాల్ కాంస్య పతకం దక్కించుకోగా, పురుషుల జావెలిన్‌త్రో ఎఫ్41 కేటగిరీలో నవదీప్‌సింగ్ కాం స్యం సొంతం చేసుకున్నాడు. పురుషుల జావెలిన్‌త్రో ఎఫ్46లో రింకూ హుడాకు రజతం, అజిత్‌కు కాంస్యం లభించాయి. మొత్తంగా భారత్ 17 పతకాలతో ఆరో స్థానంలో నిలిచింది.

అభిమన్యు ముందంజ

బ్యాంకాక్: బాక్సింగ్ వరల్డ్ క్వాలిఫయర్స్ టోర్నీలో భారత బాక్సర్ల అద్భుత ప్రదర్శన కొనసాగుతున్నది. శనివారం పురుషుల 80కిలోల విభాగంలో అభిమన్యు లౌరా 3-0 తేడాతో క్రిస్టియన్ నికోలోవ్(బల్గేరియా)పై అద్భుత విజయం సాధించాడు. ఈ ఇద్దరు యువ బాక్సర్ల మధ్య ఆఖరి వరకు హోరాహోరీ పోరు జరిగింది. తొలి రౌండ్‌లో బల్గేరియా బాక్సర్ ఆధిపత్యం ప్రదర్శిస్తే..మిగిలిన రెండు రౌండ్లలో అభిమన్యు పుంజుకుని పోటీలోకి వచ్చాడు. ప్రత్యర్థి బాక్సర్ పంచ్‌లను తిప్పికొడుతూ ఎదురుదాడితో కీలక పాయిం ట్లు ఖాతాలో వేసుకున్నాడు.

బేదాబ్రత్‌కు పసిడి

న్యూఢిల్లీ: లిమా(పెరూ) వేదికగా జరుగుతున్న ఐడబ్ల్యూఎఫ్ వరల్డ్ యూత్ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో భారత యువ లిఫ్టర్ బేదాబ్రత్ భరాలీ స్వర్ణ పతకంతో మెరిశాడు. శనివారం జరిగిన పురుషుల 73కిలోల విభాగంలో బరిలోకి దిగిన బేదాబ్రత్ స్నాచ్‌లో 136కిలోలు, క్లీన్ అండ్ జర్క్‌లో 160కిలోలతో మొత్తంగా 296కిలోలు ఎత్తి అగ్రస్థానంలో నిలిచాడు. పురుషుల 81కిలోల కేటగిరీలో సాయిరాజ్ స్నాచ్‌లో కాంస్యం ఖాతాలో వేసుకున్నాడు.

హెట్‌మైర్‌కు జరిమానా

చెన్నై: రాజస్థాన్ బ్యాటర్ షిమ్రాన్ హెట్‌మైర్‌పై జరిమానా పడింది. శుక్రవారం సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన క్వాలిఫయర్-2 మ్యాచ్‌లో హెట్‌మైర్ ఐపీఎల్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లు తేలింది. అభిషేక్‌శర్మ బౌలింగ్‌లో క్లీన్ బౌల్డ్ అయిన తర్వాత సహనం కోల్పోయాడు. దీన్ని పరిగణనలోకి తీసుకుంటూ అతని మ్యాచ్ ఫీజులో 10 శాతం కోత విధిస్తున్నట్లు నిర్వహకులు పేర్కొన్నారు.